
# మన్నూ-మహానది

పేరు 'మణి' నోరు తిరక్క 'మని' అనేవారు. ఆ పేరుకూడా నోటికి ఇమడకకాబోలు 'మన్ను' అంటుండేవారు. చివరికి 'మన్నూ' ఖాయమైంది. వయస్సు ఏడేళ్ళు - మరీ నలుపు కాక పోయినా, నలుపే. నుదురు, కనుబొమ్మలు స్ఫుటంగా అమర్చి నట్లుగా వుంటాయి. రెప్పలు పైకెత్తినప్పుడు కళ్లు తళుక్కు మన్నట్లుంటాయి. చిందరవందరగా, పాపిడ, తిన్నగా కనబడక, చమురు తగలని వైఖరి తలకట్టు, జడ. మోకాళ్ళకిందికి జారిన పరికిణీ, రంగు జుబ్బా, మెళ్లో పూసల గొలుసు - చెవలకి ఏమీ లేదు. సరదా పడినప్పుడు, లవంగం తగుల్చుగుంటుంది. పళ్లు, నవ్వు, వొంపు తిరిగిన చిన్ని గడ్డం, కులాసాగా, చలాకీగా కదిలే వైఖరి, హుషారైన పిల్ల మన్నూ. నుదురు స్ఫుటంగా వుంటుంద న్నాను. అది పూర్తి నిజంకాదు. స్ఫుటంగా అంటే, చెక్కినట్లు ఒక ఆకృతిలో వుందన్నమాట. ఎందుకంటే నేను చూసినప్పుడు, ఆమె వయస్సు పదమూడు. అప్పుడు ఆమె నుదుటిమీద మూడు అడ్డగీటులున్నాయి — కొస్త ఎడమెడంగా, మూడు చారలు - మిగతా చర్మం రంగుకి భిన్నమైన రంగుచారలు, చర్మంకాలి ఊడి నట్లు, దెబ్బ తగిలి, మానాక కొత్తచర్మం వొచ్చినట్లు, అంగుళం, అంగుళంన్నర పొడవుగల గీతలు-బ్రహ్మరాతకి మల్లె. వొకదాని కింద నొకటి, చివరిదిమట్టుకు కనుబొమ్మవైపుకు దిగింది. ఆ గీట్లు వార్ధక్యాన్ని సూచిస్తాయి సామాన్యంగా. కాని మన్నూగీట్లు అట్లాం టివికావు. ఓవిధంగా ఆమె మొహానికి అందాన్ని ఇచ్చాయేమో - అందం అనలేకపోయినా, వొకవిధమైన ఆకర్షణ వుందనిపిస్తుంది.

అవి పుట్టుకతో వొచ్చిన గీట్లా ? చెప్తాను.

మన్నూ తల్లి పాలు అమ్మకం, తాతకట్టెల వ్యాపారం, తండ్రి కూలికెళ్ళేవాడు. తల్లి, తండ్రి, చనిపొయ్యారు. తాతగారి దగ్గరవుం టుంది మన్నూ. అమ్మమ్మలేదు. ఆమె చుట్టం ఎవరో,—వొకామె



వండిపెడుతుంది. ఆమెకూడా పాలు పోస్తుంది. ఆమెకి వొక కొడుకు,— పదిహేనేళ్ళ కుర్రవాడు— 'కిట్టయ్య', పుల్లలవ్యాపారంలో సాయపడుతూ వుంటాడు. తల్లి తండ్రి ఏమి మిగిల్చి పొయ్యారో మున్నికి తెలియదు. రెండు

## బుచ్చిబాబు

కర్రబొమ్మలు మాత్రం. అమ్మ, తన కిమ్మందిట. వాటిని ఎప్పుడూ దగ్గరుంచుకుని, చూసుకుని సంబరపడిపోతూ వుంటుందిమున్ని—నల్లచేవకర్రబొమ్మలు—

రెండూ వొకటి ఆడ, వొకటి మగ, కాని రెండూ వొకలాగే వుంటాయి. రెండు కాళ్లు, తల, చేతులు నడుంతో కలిసే వుంటాయి. చెవులు, జుట్టు వున్నట్లు లేదు. అవి దేవుడు బొమ్మలంట. అమ్మ తిరపతిలో కొంది. ఏడుకొండలసామి, ఆయన పెళ్ళాం — లేకుంటే, రాధ, కృష్ణుడు — అవీ ఆ రెండు బొమ్మలు. నాలుగైదంగుళాల పొడవుగల బొమ్మలు. దేవుడు రాత్రి పక్కలో పడుకోపెట్టుకుని పరుంటుంది మన్ను. అవంటె అంత ఇష్టం. అమ్మ ఇచ్చిన బొమ్మలు. వాటితో మాట్లాడుతుంది మన్ను — బుజ్జగిస్తుంది, వాటికి నీళ్ళుపోసి, అన్నంపెట్టి, జోకొట్టి, నిద్ర పుచ్చుచుంది. అప్పుడప్పుడు, తలంటు పోస్తుంది — తను పోసుకున్నప్పుడు బైటకెడితే, వాటినికూడా తీసుకెడుతుంది.

ఆరాత్రి ఆ బొమ్మల్ని నులక మంచంపై పెట్టి, అటుఇటు పడిపోకుండా, రెండు గుడ్డపీలికలు కట్టి, మోచేతిని వాటిమీద ఆనించి పరుంది మన్ను. ఆ బొమ్మలు తన అమ్మ, అయ్యా. అయ్యా, లేకుంటె దేవుడు. తల, తాత తలకిమల్లె వుంటుంది.

మంచి నిద్రలోవుంది. ఏదో చప్పుడైంది. ఎవడో మెళ్లో చెయ్యిపెట్టి, పూసల గొలుసు లాగుతున్నాడు. కేకపెట్టింది. తనూ పెనుగులాడుతోంది ఏం జరిగిందో, ఏంతగిలిందో, తనకి తెలియదు—నుదిటికి ఏదో తగిలింది— 'అమ్మో' అని కేకపెట్టి ఏడుస్తోంది. దెబ్బ తగిలింది—రక్తం కారుతోందా! ఇంతలో ఎవరో పరుగులు, గంతులు, కేకలు, ఎవరో కట్టెలు విసురుతున్నారు తాత దీపంతెచ్చాడు. దొంగాడు—వెళ్ళాడులే. 'ఏం ఎత్తికెళ్ళాడు' తాత నుదిటికి ఏదో అద్దాడు, గుడ్డ కట్టాడు.

అయ్యో, అమ్మో అని ఏడుస్తోంది మన్ను. "ఏందే నీయాగడం — ఎందుకో ఏడుపు?" తాత గదమాయిస్తూ, దీపంతో నాలుగుమూలలా చూస్తున్నాడు.

"నాబొమ్మలెత్తికెళ్ళాడు — రెండు బొమ్మలూ" మంచంకింద వెదుకుతోంది. గుడ్డపీలిక తెంచి, బొమ్మలెత్తికెళ్ళాడు.

"ఆడు. బొమ్మలేం చేసుకుంటాడే ఉండు వెదుకుతా."

తాత, వెనక కిట్టయ్య బైటికివెళ్ళి వెదుకుతున్నారు. మన్ను నిద్రపోయింది ప్రొద్దుటే లేచి, సందుచివర పుల్లల పక్కనా. గడ్డివాములోనూ బొమ్మల కోసం వెదికింది. కనబడలేదు. వాటిని తల్చుకుని పడుకునేది రాత్రుళ్ళు. పని మీద ఎవరింటికేనా వెళ్లినప్పుడు, అట్లాంటి బొమ్మలు కనబడతాయేమోనని పరకాయించి చూసేది. గుళ్ళోవుంది వొక బొమ్మ. పెద్దది. నల్లగా, పెద్దకళ్లు, నెత్తిన టోపీ, చేతులో అదేంటో పట్టుకుని, పంచి, కండువ కప్పుకుని వుంటుంది ఆ గుళ్లోబొమ్మ. తన బొమ్మ కాదు.

మరో రెండేళ్ళు గడిచాక, పైవూరు వెళ్ళారు. మన్ను, తాత, కిట్టయ్య, వాడి తల్లి. తాత కొంతలాభం తెచ్చుకున్నాడు. మరి రెండు గేదెలు కొన్నాడు. ఆ ఊరు కాస్తంత పెద్దది. విశాలమైన రోడ్లు,— ఇళ్ళచుట్టూ గోడలు, తోటలు, మిద్దెలు, మేడలు, గుర్రంబళ్ళు, పెద్ద బజారు—

పండగలా వుంటుంది. రోడ్లంట అక్క-డక్కడ దీపాలు, లారీలు, బస్సులు తిరుగుతాయి. దుమ్ములేస్తుంది. దవాళ్ బంట్రోతులు సైకిళ్ళమీద తిరుగుతూ వుంటారు. ఊరు నడుమ పెద్ద చెరువు. అందులో స్నానాలు. రాత్రి ఎవరో కథ చెప్తాడు. నలుగురూ పోగవుతారు. భలే సర్దాగా వుంటుంది. అవతల దూరంగా సినిమా హాలు, కాఫీహోటళ్ళు, ఇంకా అవతల చాకిరేవు, పిల్లకాలవ-పొలాల నడుమ సీతాకోక చిలుకలు, ఆకాశంలో క త్తిరితోక, పిగిలిపిట్టలు-ఈలలు వేస్తూ వుంటాయి. పొలంలో కుర్రాళ్ళు, గాలి పటాలు ఎగరేస్తారు. వాళ్ళల్లో కిట్టయ్యా వుంటాడు. వాడికి మీసకట్టు. భలేగా వాస్తోంది. పాగాచుడతాడు. ఊడిపోతూ వుంటుంది. మళ్ళా చుడతాడు గాలిపటం ఎగరేస్తాడు.

కట్టెలు, బండిమీద వేసుకుని గొపొర్రి ఇళ్ళల్లో ఇచ్చివొస్తాడుకిట్టయ్య. తాతయ్య గేదెల్ని తోలికెళ్ళి ఇళ్ళముందు పాలు పితుకుతాడు. గిన్ని, గ్లాసు లోపలికి తీసికెళ్ళి పాలుకొలిచి పోస్తుంది మన్ను. తనకి ఈపనిష్టం. పొదుగు పక్క-నే కూర్చుని, పాలు పిండుతుంటె చూడ్డం సరదాగా వుంటుంది. మధ్యమధ్య తనూ వేళ్ళపెట్టి పిండుతుంది, ఏమిటో తిర కాసు-తను పిండితే సరిగ్గా రావు. తాత వేళ్ళకి అవి అలవాటు పడ్డాయి. గేదె వెన్నుమీద ఎర్రటిపుండు-ఎట్ల పడిందో. దానిపై ఈగలు ముసురుతాయి. తోక ఆడిస్తుంది. కళ్ళల్లోకి దిగులుగా చూస్తుంది. దూడ ఎగిరిపడుతుంది. ముందుకాళ్ళు నిలబడవేం-అయ్యో పడిపోతుంది. ఎత్తుకోవా? దాదా దా మెడని కౌగలించుకుంటుంది-తన జడ మాదిరి; దానితోక నూనె రాయదేం? గడ్డిలో పడు కుని, దూడ కళ్ళల్లోకి చూస్తుంటుంది. ఏదో చప్పుడు. ఏదో కాదు మనుషులు దిగుతారు, ఎక్కు-తారు. పెద్ద కూత-దర్ దర్, బర్ బర్-మెట్లెక్కి- వెడతారు, దిగుతారు. మళ్ళా దర్ దర్, బర్ బర్ ఇది ఎవరిదో, పెద్దోరి లోగిలి. చుట్టూ పెద్దగోడ. గేటు, చెట్ల మొక్క-లు వొకపక్క- పచ్చటి గడ్డి - మెత్తగా వుంటుంది. పడుకోవాలనిపిస్తుంది. అక్క-డ పాలుపితకడం ఎవడో ముసిలోడు వస్తాడు. తప్పాలా, గ్లాసు తీసు తీసుకుని వాడితో ముందుగదిలో కెడుతుంది. అక్క-డ పెద్ద అద్దాల తలుపు లోన కిటికీ. తొంగిచూస్తే పెద్ద కుర్చీలు ఊగే ఉయ్యాల, గోడని అద్దాలు, పటాలు, బొమ్మలు - భలె, భలె ఎవరో వొకాయన. కోటు, లాగు-భలె, మెరిసే చొక్కా-, పెద్దోడె, ఆయన వెనకాలె, మరొకామె - "తే, పాలతప్పేలా, ఏమి టల్లా చూస్తావ్?" కసిరింది, ఆయన తలుపు వేశాడు.

బైట కొచ్చేస్తుంది మన్ను.

"భలేగుంది తాతా, లోన — భలే బొమ్మలు."

నవ్వుతాడు తాత. గేదెల్ని తోలతాడు రెక్క- పుచ్చుగుని లాక్కు-పోతాడు.

ఆ గొపొర్రి లోగిలికెళ్ళడం అంటె, మన్నుకి సరదా. ఎప్పుడు తెల్లారుతుందా ఎప్పుడక్క-డికి వెళ్ళిపడదామా అని కాచుకుని గడుపుతుంది రాత్రుళ్ళు. ఆ ఇంట్లో గదిలో. వింతవింత వొస్తువు

లను చూసింది. వాటిని దగ్గరగా, పరీక్షగా, పూర్తిగా చూడలేదు. అందులో ఏదోవుంది, తనని ఆకర్షిస్తోంది.

ఆరోజు ఉదయం ఏడు దాటింది. తాత పక్కింట్లో పాలుపోస్తున్నాడు. ఇంక ఇక్కడికి రావడానికి గడువుంది. తెల్లపరికిణీ, పసుపుపచ్చరంగుది పొడుగుచేతుల రవిక వేసుకుంది. ఆగది చూడడానికి తగినదిగావుండాలని ముందు గదిలో కెళ్ళింది. కింద తివాచీలున్నాయి. మెత్తగా తగుల్తాయి కాలికి. రంగురంగులవి–గోడని పెద్ద అద్దం. బీరువాలో ఎన్నో వొస్తువులు–అద్దాల బీరువా. తలుపుపైన గోడని పెద్ద గడియారం గుండ్రంగా, తెల్లబిళ్ళ, అటూ ఇటూ ఆడుద్ది. పైన ముళ్ళు, అంకెలు–టక్,టక్ టక్–భలే–అద్దుగదా! గంట కొట్టింది–టంగ్,టింగ్, టాంగ్, డాంగ్‌గింగ్‌గ్.... భలే అదేటి–పాట మాదిరి, మరో అడుగు లోపల కేసింది.

"ఎవరది ?" అని ఎవరిదో కంఠం బాబో—అనుకుని చటుక్కున బైటికి వచ్చేసింది.

"ఎటో పొయ్యా, —షికార్లేందే ?" తాతకంఠం.

"లోపల చూస్తున్నా—భలే పాడుద్ది తాతా, గడియారం, టంగ్, టింగ్, టాంగ్, డాంగ్‌గింగ్...."

"అట్టగా. అయ్యన్నీ ఈన తండ్రి గారి సంపాదన. పేకాట్లో. జూదంఆడి డబ్బు గడించాడు. చచ్చాడు. కొడుకు కోడలు, హయాం ఇది, ఈనా, అంతే పనీలేదు, పాటాలేదు. ఆ సంతా తగల బెడుతుంటాడు. కారుకూడా అమ్మేశాడంట. పట్టుకో పలుపు" పలుప్ప పట్టుకున్నా, మన్ను చూపంతా ఆగదిపైననే ఇక్కడనుంచి ఏమీ కనపడ్డంలేదు. ఎవరో వొకాయన మెరిసే చొక్కా మనిషి కిటికీముందు పచార్లు చేస్తున్నాడు ఇటుకేసి చూస్తున్నాడు. తనకేమీ తెలియనట్లు గడ్డిలో పడుకుని దూడ మెడ దువ్వుతోంది. చెవి ఆనించి వింటోంది, దూడ లోపల ఏదో వింతచప్పుడు, లోపల అచంతా ఏమిటో దాని పొట్టలో గడియారం వుందా ?తనకి తెలీదు.

నాలుగైదు నెలలు గడిచాక, మన్ను ఆ ఇంటికి సాయంత్రం నాలుగింటికే వెళ్ళింది–తాత పాలు తేవడానికి కాస్త ఆలస్యం అవుతుందని చెప్పడానికని నిజానికి తాత. రామయ్య మాట్లాడుకుంటుంటే విని అలాఅని గ్రహించింది కాని తనలో ఆ విషయం చెప్పిరమ్మని చెప్పలేదు తాత.

గేటుదాటి వెళ్ళేసరికి, ఆకాశంలో ఉరుములు, మెరుపులు విజృంభించాయి. నలుపు ఎరుపు కలిసిన రంగుతో దట్టమైన మేఘాలు, గాలిపటాలల్లె, ముక్కలుగా విడిపోయి, ఎగురుతూ పోతున్నాయి. ఆవరణలో ఎవ్వరూ లేరు. గాడిద బెదురుతూ, పక్కింటి చూరుకింద చేరింది. రిబ్బన్లవాడు బండి తోసుకుంటూ, వేగంగా వెడుతున్నాడు. చక్కలిగింత పెట్టినట్లు వర్షంచుక్కలు వొక్కటొక్కటె నేలమీదపడి చప్పుడు చేస్తున్నాయి. ఆ చప్పుళ్ళని లెక్కపెడుతోంది మన్ను. వర్షంపంకని ఆ లోగిలి గదిలోకి వెళ్ళడానికి నిశ్చయించుకుంది. అరవై అరవై వొకటి, అరవై రెండు—

అమ్మో,—ఎలా లెక్కపెట్టడం! అన్ని వొక్కసారే పడుతుందయ్యే! రెండు వందలు—కలుపు — అన్నీ కలిపితే ఆరొందలు—అమ్మో మొహాన కొడుతున్నాయి. వరుగెత్తింది. గదిముందు చూరుకింద నిలబడింది. బైట చెట్ల నడుమ కంతల్లోంచి వర్షం, పడుతోంది జనం, సందడి, లేదు. చెట్టు కిందగడ్డి రంగు ముదురుతోంది. రాతిబండలు, కట్టెలు,రంబులు,గుర్రంజీను. మోటారు చక్రం-ఆవరణలో, తమాషా వొస్తువులు వున్నాయి. వాటిని ఆనుకున్న నేల, పొడిగా వుంది. ఇంకా తడవలేదు. పొడిగావున్న భాగాలు, వొక్కొక్కటే తడిసి మట్టిగా జారడం గమనస్తోంది. గది తలుపుకి ఆనింది-వర్షం మీదపడుతుంటే తప్పుకున్నట్లు. అమ్మో ఉరుము చెట్లకొమ్మలు గుద్దులాడుకున్న చప్పుడు తలుపు తోసింది. తెరుచుకుంది, గదిలో ఎవ్వరూలెరు. గడియారం బిళ్ళ, అటూ ఇటూ కదుల్తోంది. గోడని ఆ పెద్దఅద్దం లేదే? ఏమైనట్లు? కింద తివాసీలులేవే. నేల కాలికి చల్లగా తగుల్తోంది. వర్షం పడుతుందని లోపల పెట్టేశారా? గదిలో వొక మూలకి నడిచింది. అక్కడ గోడలో వొక అద్దాల తలుపుల అలమారు.పొడుగ్గావుంది. అందులోబొమ్మలు కర్రవి. నల్లకర్ర, ఎర్రకర్ర,తెలుపుకర్ర ఏనుగులు,ఏవోలాగుతున్నాయి.చిలకలు. నీళ్ళుతెస్తున్న ఆడమనిషిబొమ్మ అదుగో మూల దేవుడు బొమ్మలు. తన బొమ్మల్లాంటివె పెద్దవి. ఎత్తుగా వున్నాయి. చేతులు వేళ్లు. పాదాలు, భలేగున్నాయి అదుగో జుట్టు—తన బొమ్మలకిమల్లె గుండుకాదు. మొగ, ఆడ — రెండు బొమ్మలు. అమ్మ, అయ్య. రాధ, కృష్ణుడు. ఆడ. దేవుడు, మగదేవుడు—తలుపు లాగింది వొచ్చేసింది. చెయ్యి పెట్టి బొమ్మని తడుముతోంది—నిమురుతూంది. మెత్తగా. గరుగ్గా — భలే వాసన—ఏందబ్బా—గంధం, ఆరతి, కరుపురం దండ వాసన-బైటికి లాగితే-

ఎదురుగా తలుపుచప్పుడైంది. తోసుకుంటూ ఎవరో లోనికొచ్చాడు. మెరిసే చొక్కా ఆయన— రాజారాంగారంట. పైన తువ్వాలు. లాగు, జుబ్బా—మీసకట్టు, డాగుపడ్డ పళ్ళవరస. చేతులో బెత్తం.

"ఏమిటి చేస్తున్నావ్?" బొంగురు గొంతు—

తలుపు మూసేసి, వెనక్కి తిరిగి గది గుమ్మందగ్గరకు గెంతింది మన్ను.

"ఓ నువ్వా-పాలపిల్ల!"

"చూస్తుండా"

---




ఎంబ్రోసియా
హఠాత్తుగావచ్చేఅతిథులకు
మధురానందమిస్తుంది!

"ఏమిటి?"

"బొమ్మల్ని ఖలేగున్నాయి."

"ఫరవాలేదు-లోనికి రా - రా, రా, దగ్గరగా చూడు."

మంచాయన రమ్మంటుండాడు వెళ్ళింది.

"ఇదిగో ఇయ్యి."

"చూపేదా?"

అని రాజారాం, వొక బొమ్మని పైకి లాగి, తువ్వాలుతో దులిపి ఆమె చేతి కిచ్చాడు పట్టుగుంది-రెండు చేతుల్తో, గట్టిగా గుండెకి హత్తుకుంది ఊగింది.

"ఇందండి."

తీసుకుని ఆయన లోపల పెట్టేశాడు.

"అదో ఆ రెండోది" అంది. రెండో బొమ్మనికూడా ఇవతలికి లాగి దులిపి, ఆమె కిచ్చాడు రాజారాం. తీసుకుంది నేలమీద కూర్చుంది. పరికిణీ అంచుతో బొమ్మని రాసింది. మెడ బొమ్మమీద ఆనించింది. ఊగింది కళ్లు మూసుకుంది అడ దేవుడు-అమ్మ చచ్చిపోయిందిగా అమ్మ దేముడైంది: తనకి బొమ్మ నిచ్చింది చచ్చిపోయింది. ఆ బొమ్మని దొంగాడెత్తికెళ్లాడు. తనకి బొమ్మలేదు. అమ్మలేదు-అమ్మాలేదు, బొమ్మాలేదు. ఇదిగో ఇక్కడుంది. ఈ రాజారాంగారింట్లో. మంచోడు, బొమ్మిచ్చాడు. దాని కేసి పదేపదే చూసుకుంది.

"ఇందండి"

"ఇందండి"

రాజారాం తీసుకోబోయాడు.

"నే పెట్టేదాండి?"

"ఓ"

తలుపు భద్రంగా తీసింది. లోపల పెట్టడానికి బొమ్మని పైకెత్తింది.

"ఒసేయ్, ఏందది?" అని ఏదో కంఠం గర్జించింది. మున్ని బెదిరిపోయి. ఆ బొమ్మని అలమారులో వొదిలేసింది. అది అడ్డంగా మిగత వొస్తువులమీద పడింది, నాలుగైదు వొస్తువులు అలమార్లోంచి కింద నేలమీద పడ్డాయి. కొన్ని గాజువి-కిందపడి పగిలాయి. మరికొన్ని కర్ర బొమ్మలు పడి చప్పుడు చేశాయి.

"నిన్ను లోనికెవడు రమ్మన్నాడు. ఒళ్ళు బలిసిందా. పద బైటికి" అంటూ ఆ పెద్ద కంఠంవాడు ఆమెచెయ్యి పట్టుకుని లాగుతున్నాడు.

"వొదులు, చెయ్యి. నీకెందుకు?"

"ఫరవాలేదులే, —పాలువోసేపిల్ల — ఊరుకో శానయ్య" అన్నాడు రాజారాం.

"ఈళ్ళకి చేతివాటం జాస్తి. లోనికి రాని స్తిరా....మీరెరగర్లెండి" అన్నాడు శానయ్య.

"ఫరవాలేదు - మనపాలమనిషేగా - ఊరికే చూస్తాంనంటె, చూడమన్నా. చిన్నపిల్ల సరదాపడుతోంది."

"నేనేం అట్లాంటిదాన్నికాను. పైగా నాబొమ్మలే ఎత్తుకుపొయ్యాడు దొంగాడు శనిగాడు" అంటూండగానే మున్ని కళ్ళంట నీరు తిరుగుతున్నాయి. చేత్తో తుడుచుకుంటూ. గుమ్మం దాటింది.

"నేనేం అందుకు రాలేదు. మా తాత ఆలస్యంగా వస్తాడు—అని చెబుదామని వొచ్చా తెలిసిందా" అని రోషంతో శానయ్యవైపు చూసింది.

నడు, నడు-ఇట్లా రామోక" అన్నాడు శానయ్య పగిలిన సామాను ఏరి సర్దుతూ.

బైటికి నడిచి వెళ్ళింది. ఆ సాయం

త్రం తాతతో వెళ్ళలేదు మన్ను. అలిగింది—ఎవరిపైనో కోపం – శనిగాడు–మశానయ్య మశానంగాడు. వాడుచేసిందే ఇదంతా. వాడు అరిచే తలికి, బెదిరి పోయింది. మరి అంతుమూలకంగా ఆ బొమ్మలన్నీ పడ్డాయి. కాని ఆడదేవుడు బొమ్మ దాగింది. పగల్లేదు. మరిగని విరిగిందా ? చూడాలి, లోనికి రానియ్యరుగా. రాజారాంగార్ని అడిగితే.

రెండునెల్ల తర్వాత వెళ్ళింది. రాజారాంగారింటికి; అప్పుడికి అలక చేరింది. తాత ఇంటికాడ పడుకున్నాడు. లేచేతరికి తిరిగిరావాలి. పరుగెత్తుకు వెళ్ళింది. తలుపు తోసింది రాదు. అవతల తలుపు తాళం పెట్టివుంది ఎవ్వరూలేరు. ఏమయ్యారు చెప్మా? మశానంగాడుకనపడ్డే? తలుపు సందుల్లోంచి చూసింది. ఏమన్నా కనపడుతుందేమోనని ఏమీలేదు. చెవి తలుపుకి ఆనించి వింది. గడియారం మోగుతోందా ? బైట ఆవరణకేసి చూస్తోంది. కారుచక్రం లేదు. రంబు లేదు. జీనులేదు. ఊరికెళ్ళారా? గడియారం కొట్టింది. టంగ్,టంగ్,టాంగ్. డాంగ్గింగ్ .... ఖలే–సంగీతం పాడుతోంది. చెడిపోలేదు. బొమ్మకూడా భద్రంగానే వుంటుంది. ఇంటికొచ్చేసింది. మర్నాడు వెళ్ళింది. ఆ మర్నాడు వెళ్ళింది. తాత చెప్పాడు–ఊరెళ్ళారంట. ఎందుకో, ఎప్పుడొస్తారో ?

నెల గడిచింది.

తాత చెప్పాడు. రాజారాం ఊర్నించి వొచ్చాడంట వారం అయిందట. తనకి ఇంతవరకూ ఎందుకు చెప్పలేదు? ఏమొ. తాత చిత్రమైన మనిషి. కొన్ని చెప్పడు కొన్ని అడక్కుండానే చెప్తాడు. రేపు తనూ వెడుతుంది. తాతయ్య, రాజారాంగారింటికి. ప్రొద్దుటె. బొమ్మ ఎట్లాగుందో చూడాలి, అడగాలి. తెల్లవారింది కిట్టయ్య, లారీతో పోతానని, పెందరకళే ఇంత తిని వెళ్ళాడు. వాళ్ళమ్మ. వసారా ఊడుస్తోంది. "తాతా, లెగు లెగు....పొద్దోయింది" అని వూపింది తాతని. కాని లేవలేదు. ఇంకా ఊపింది కిష్టయ్య తల్లి తాతని ఊపింది. "అయ్యో" అని కేక పెట్టి, మంచంమీద పడి ఏడుస్తోంది. తాత చచ్చిపొయ్యాడంట. తాతమీదపడి ఏడుస్తుంది మన్ను. ఇదేంది తనకేమీ, ఎవ్వరూ లేకుండా పోతూవుంది అమ్మ లేదు. అయ్యలేడు – అమమ్మ లేదు. ఇప్పుడు తాతలేడు. అమ్మిచ్చిన బొమ్మని దొంగ కాజేశాడు. దేవుడు బొమ్మ సూడ నీకండా ఆ మశానంగాడు–తనది ఏమీ లేదు. తనకి ఎవ్వరూలేరు. వర్షంచుక్కలు మొహంమ్మీద పడతాయి. చలి పీకుతుంది. ఎండ కాలుస్తుంది. మట్టి–మట్టి–మన్ను–మన్ను మశానం.

ఎండ కాస్తుంది మళ్ళా. మధ్య వర్షం కురుస్తుంది. కిట్టయ్య లారీపని. వాడమ్మ వంట, పాలు–పక్కింటి రామయ్య కట్టెల వ్యాపారం చూసుకుంటున్నాడు. తాత మంచం, పంచన చేరవేశారు. కిట్టయ్య తల్లికి తలనొప్పంట ఆరోజు "నే వెడతాలే పాలకి" అంది మన్ను.

"రామయ్య తమ్ముడు వొస్తాడు—వాడితో కలిసి వెడుదువుగానిలే. నీకు లొంగదుగా గేదె."

"సర్లె."

మధ్యాహ్నం మూడైంది. రామయ్య

తమ్ముడు రాలేదు. నాలుగైంది. తనే వెళ్లింది రామయ్య ఇంటికి. తమ్ముడు సంతకాడికెళ్ళాడు. నువ్వే వెళ్ల అన్నాడు రామయ్య."

"ఎటుకేసి వెళ్ళాడు ?"

"ఏమొ"

గబగబ నడుచుకుంటూ, రాజారాం గారి ఇంటివైపు వెళ్లింది మన్ను. గేటు తెరిచివుంది. ఆవరణలో ఎడ్లబండివుంది నలుగురైదుగురు జనం ఏదో సర్దుతున్నారు. ఇంట్లోంచి వొక్కొక్క సామానే తెచ్చి బండిలో పెడుతున్నారు పెద్దబల్ల, మంచం, కుర్చీలు, పెద్దపెట్టెలు లోనికెళ్లింది. జనం కొందరు లోపలికెడుతున్నారు, కొందరు బైట కొస్తున్నారు. రాజారాంగారెక్కడ? కనబడరేం ముందుగదిలోకి జొరబడ్డారు. ఇద్దరు మనుషులు. ఒకడు దవాలి బంట్రోతు గదిలోంచి సామాన్లు బైటికి తెచ్చి బండిలో పెడుతున్నాడు. అదుగో అద్దం. అదుగో బొమ్మ — ఆడదేవుడు మొగదేవుడు — ఇంకా బొమ్మలు. బైటకొచ్చాడు రాజారాం తీసుకెళ్ళేవాడిని అటకాయించాడు.

"ఇవి ముట్టుకుంటె చంపేస్తా" అన్నాడు రాజారాం.

"కోర్టులో చెప్పుకోండి — మాకు అడ్డంరాకండి" అని బంట్రోతు.

"వల్లకాదు."

"తొలుగు"

"తంతా"

"పోలీసుల్లేరూ - తప్పుకో" ఇద్దరూ పెనుగులాడుతున్నారు? రాజారాంగారు. వాణ్ణి తన్నబోతే, వాడు తప్పించుకున్నాడు. మరో ఇద్దరు రాజారాంని పట్టుకున్నారు. కదలనీకండా రాజారాం విదిలించుకున్నాడు.

"ఈ గదిలోనివి తీస్తే చంపుతా" అని అరుస్తున్నాడు.

"ఇక ఇప్పుడు ఆగేదిలేదు. లాక్కుపోయి వేలం పాడెయ్యాల్సిందే, పదంౘ్ా" అని వొకడు రాజారాంని పక్కకి లాగాడు. మరి ఇద్దరు గదిలో సామాను గబగబ తెచ్చేసి బండిలో వేపేస్తున్నారు. అలమారులో బొమ్మలన్నీ బుట్టలో వేస్తున్నాడు శనిగాడు-శానయ్య.

"శానయ్యా నువ్వోనా?" అంటాడు రాజారాం,

"మరి చేసేదేంది-జప్తు యవ్వారంగా కోర్టువారి హుకుం. అమీనా చెప్తుండాదుగా." ఆ బుట్ట బండిమీద గిరవాటెట్టాడు. అందులోంచి కొని సామానులు కిందకు దొర్లి చప్పుడైనాయి. వీధిలో గేటుదగ్గర, జనం మూగారు. కొందరు నవ్వుతున్నారు. కిందపడిన బొమ్మల్ని మన్ను తియ్యబోయింది.

"నువ్వెవత్తివె పో-భడవా" అని వొకడు ఆమెను ఇవతలికి లాగాడు. మళ్ళా రాజారాం బండిదగ్గర కొచ్చాడు. దవాళి బంట్రోతు పిర్రమీద వొక్క తాపు తన్నాడు- వాడు ఎదురు తిరిగి, చొక్కా చేతులు పైకి మడిచి, "కాళ్ళు చేతులు, కట్టి పడెయ్యమంటావా?" అని మీదికి వెళ్ళాడు.

మన్ను రాజారాం వెనక్కి-వెళ్ళి నిలబడింది.

"ఒసే నువ్వెవత్తివె. అవతలకి పో- ఉడత పీకుడు మొహం వేసుకుని-పో."




అది శానయ్య అరుపు. మన్ను కిందపడ్డ వాటిని ఏరుతోంది. నౌకరు ఆమెను తోస్తున్నాడు. రాజారాం కలియబడ్డాడు. బంట్రోతు చేతుల్లో సామాను లాక్కున్నాడు. పెద్ద పెనుగులాట. మరొక లావాటివాడు ఇద్దరిమధ్యాపడి, గుప్పెట్లో సామాను ఎగిరేటట్టు బలంగా కొట్టాడు. మన్ను "అమ్మో" మంది. ఏదో వొక గాజువొస్తువు పగిలి, పెంకు ఆమె నుదుటికి తగిలింది.

"పొమ్మంటే పోవేందే?" అని శానయ్య, ఆమెని బరబర, ఈడ్చుకుపోయి, గేటవతల కూలదోశాడు." నుదుటిమీదనుంచి రక్తం అరచేతికి తగుల్తోంది. ఎర్రగా అయింది. తుడుచుకుంది. ఎవడో గేటు ఎడంచేసాడు. సామాన్లతో ఎడ్లబండి, గేటుదాటి బైట కొచ్చింది. రాజారాంని ఇద్దరు గట్టిగా పట్టుకుని గదిలోకి తీసుకెళ్లారు. బండివెనక వెడుతున్నాడు శానయ్య.

"ఛో, కొంపకాడికి—"

అని ఆమేచేతిని నలిపి, దూరంగా తోశాడు. వాడి చేతి చెమట తగిలింది. మనిషివాసన మన్ను తలతిరిగింది. ఎంత గట్టిచెయ్యి? కోసిన కట్టెకుమల్లె—వాడూ వాడి గడ్డం, నల్ల కళ్ళు, వంకరపాగా, తేనెమట్టుకుమల్లె క్రాపింగు, బొత్తంలేని చొక్కానడుమ, మెడకింద నల్లవెంట్రుకలు, ఆ చమట, ఆ వాసన మన్ను దోక్కుంది. రోడ్డుమీద ఎవరో లేవ

దీశారు. గిన్నెతో సీళ్లిచ్చారు. ఇంటి కెళ్లింది. కిట్టయ్యతల్లి, నుదుటికి ఏదో రాసి, గుడ్డ కట్టింది. అది నుదుటిమీద రెండో గీత కథ.

మరో, యాణ్ణర్ధం జరిగాక, 'మన్ను' జీవితంలో మరో వింత జరిగింది. కిట్టయ్యకి పెండ్లయింది. మన్ను తాత, కొంతవెనకవేసి వెళ్ళాడు. ఎంతో మన్నుకు తెలియదు. ఆమెకు తిండి, బట్ట లోటులేకుండా జరుపుతున్నారు. కిష్టయ్య తల్లి అతని భార్య వచ్చాక, మన్నుకి ఇంటి చాకిరి కొంత తగ్గింది. ఇంకా లాభదాయకమైన పనులు చూసుకోవచ్చునని, అందరూ పట్నంలో మకాం పెట్టాలని నిశ్చయించారు. మన్ను పెద్దమనిషైంది. పై నెలలో. పట్నం వెళ్ళారు. మరుమూల ప్రాంతంలో, పాక పాతిల్లు. అద్దెకు తీసుకున్నారు. కిష్టయ్యకి లారీపని. దగ్గరలో కంపెనీలో అప్పుడప్పుడు చిల్లర పన్లు దొరుకుతాయి కట్టెల వ్యాపారం వొదిలేశారు కాని, పాలు నష్టయి కొనసాగించాలని ఇద్దరు పనివాళ్ళను కుదుర్చుకుని. నాలుగు గేదెలనుకొన్నారు. దగ్గరలోమే పేటందుకు గడ్డి బయలుంది. ఇల్లు పాతదైనా, చుట్టూ మట్టి గోడా, దొడ్లో నుయ్యి, ముందు కుళాయిలూ విద్యుత్ దీపాలూ అన్నీ ఏర్పాటుగా వున్నాయి.

ఎవళ్లెవళ్ళకి ఎంతెంత పాలు కావాలో కనుక్కొందామని సాయంత్రం నాలుగింటికి బైలుదేరింది మన్ను. పరికిణీ – ఎర్రగళ్ళది – ఆకుపచ్చ రవిక. పైన తెల్లటి ఓణీ వేసుకుంది. ఓణీ పొడుగు చాలినంత లేదు. ముందుకు లాగితే వెనక తక్కువవుతుంది. పమిటి భుజం దిగడంలేదు. ముందుకే లాగింది. చెవలకి, రింగులు అమర్చుకుంది. కిష్టయ్య పెండ్లాం పెట్టుకునేమాదిరివి. చేతులకు ఎర్రగాజులు – మెళ్ళో పట్టి – వంకర టింకర పాపిడ, జడ మెడవెనక రేగి చిందర వందరగా పడుతుంది. బొట్టు లేదు. పెట్టుకుంటె నుదుటిమీద ఆ రెండు గీట్లూ మరింత స్పష్టంగా కనబడతాయని భయం కాబోలు. కాలి రెండో వేలుకి మట్టి – పొక్కుత్తి బయలుదేరింది వీధివైపుకు రాగానే ఎత్తయిన గోడలు – మధ్య పెద్ద గేటు. గేటు ఎదురుగా చిన్న చిన్న ఇళ్ళు. గేటుదగ్గర ద వా లి బంట్రోతు. ఎందుకో చెప్పింది. లోపలికి వెళ్ళనిచ్చాడు. అంతా ఖాళీస్థలం —— జీపులు కార్లు, లారీబండ్లు – మనుషులు దూరంగా తిరుగుతున్నారు. ఎవరితో మాట్లాడాలి? తొందరగా నడిచింది. నలుగురైదుగురు ఆడపిల్లలు, పరుగెడుతున్నారు. వారిని కేకేసి అడిగితే. ఇక్కడంతా అరవంట. తనకి అరవం రాదు. నవ్వుతారేమో. కాస్త దూరం వెళ్లాక, పెద్ద గోడలు కనిపించాయి. —— రంగుల గోడలు. లోపలికెళ్లింది. ఎన్నో పెద్దగదులు, తివాచీలు – గోడల్ని పెద్ద అద్దాలు. బల్లలు వానిపైన స్థంభాలు దీపం చెమ్మాలు – నడుమ బంగారం తాళ్ళ ఉయ్యాల. భలే అందంగవుంది. ఉయ్యాలపై పరుపులు. రంగురంగుల దుప్పట్లు – మనుషులేరేంది? మరో గదిలో కెళ్లింది, అక్కడ చీకటిగావుంది. దాన్నిండా బల్లలు, కుర్చీలు. తివాసులు, పాపలు దిమ్మలు, లేళ్ళ బొమ్మలు,

కొండలు - ఇదేందబ్బా - పెళ్ళివారిల్లా ? చీకటిగదివెనక పెద్ద వరండా - అక్కడ అంతా గోడలు, కొండలు, రాళ్ళ, దిమ్మలు-నడుమ స్తంభాలు. ఆటిల్లోంచి, నీళ్ళుఎగిరిపడుతుంటాయి ధారలుగా-కింది నుంచి వర్షం. భలే. అక్కడ జనం— బోలెడుమంది. రాళ్ళు విసిరేస్తున్నారు. అదేంటి ఆ కొండని తోస్తున్నారు ? భలే బలం వాళ్ళది. నిక్కర్లు, టోపీలు, చొక్కాలు, బూట్సు, తగుల్చుకుని. హుషారుగా, పని చేస్తున్నారు. ఆళ్ళని అడిగితే ? అరవం మాట్లాడుతుండారు. ఇంకా అవతలికి నడిచింది. మరో లోగిలి, పెద్దపెద్ద దీపాలు వేళ్ళాడుతుంటాయి. నడుమ పెద్ద దిమ్మ - పట్టాకుర్చీ వెనక ఎత్తు స్తంభాలు. ఆటినిండా పూలు ఆకులు, రంగులు - బొమ్మలు. స్తంభాల నడుమ కిటికి. దానిమీద మరో స్తంభం. ఆ స్తంభంపైకి చూపింది మన్ను. దాని మీద రెండు బొమ్మలున్నాయి. అడ దేవుడు, మగదేవుడు. దొంగాడెత్తుకు పోయిన బొమ్మలు మాదిరివే. చేతులు నడుంపైన. మెళ్లో ఎయ్యి గొలుసులు. రాళ్ళు మెరుస్తుండై. జుట్టుంది. మొగ బొమ్మనె త్తిన టోపిలాంటిది. దేవుడి కిరీటం. రాజారాంగారింట్లో బొమ్మలు ఈ మాదిరివే - కాని ఇవి చాలా పెద్దవి. తన చేతులకి వాటి పాదాలుమాత్రం తగుల్తున్నాయి. వాటిని తాకాలి, దగ్గరగా చూడాలి ఎట్లాగబ్బా? ఏదన్నా పీటన్నా. కుర్చీఅన్నా వేసుకుని, దానిపై నిలబడితే అందుతుంది బొమ్మ. అచ్చంగా అమ్మ దేవుడుబొమ్మ, ఎంత బాగుంది. దగ్గరగా చూసి తాకి, చేతులతో బుజ్జగించాలి. పాదాలు తగుల్తున్నాయి. వేళ్లు భలే గున్నాయి. పీట ఎక్కడుంటుందబ్బా - లోపలికి నడిచింది. అక్కడ దీపాలున్నాయి. పీట లేదు. అవన్నీ గోడలు కింద నేల - రాళ్ళు - గడ్డి - గోడల్ని ఆనించి తివాసులు, చాపలు - బాటో, ఇదేంది ? ఏనుగుతల ? తాకింది. ఏనుగు తల నర్కా-సేనుగ చెవులు - తొండం


పల్లెలు పట్టణాలవుతున్నాయి
పట్టణాలు నగరాలవుతున్నాయి
మిద్దెలు మేడలవుతున్నాయి
మేడలు భవనాలవుతున్నాయి

మిద్దెలూ, మేడలూ భవనాలూ పదికాలాలపాటుఅందంగాబలంగా హుందాగా ఉండాలంటే -

డా॥ పుట్టా రామదాసుగారు

శ్రీనివాసా బ్రిక్ వర్క్స్ - ప్రాతూరు

సీతానగరం దేవస్థానం - తాడేపల్లి పోస్టు - గుంటూరుజిల్లా వారిని సంప్రదించండి. వారిదగ్గర మేలురకమైన ఇటుక, పెంకు, తారస, పాలాస్త్రి లభ్యమవుతుంది. సరుకు నాణ్యం ధరస్వల్పం.

అమ్మి ఇంకా ముందుకెళ్ళింది. అక్కడ దీపాలు లేవు. చీకటిగా వుంది. దూలలు మట్టి వొకదానిపైన వొకటి పడేసి వున్నాయి. వాటివెనక అదేమిటి? కుర్చీ పీట — పక్కకు తిరిగి చెయ్యి చాపింది మన్న.

"ఇటొచ్చా — నా ముంగిమొగం"

బెదిరి అడుగు వెనక్కివేసింది మన్న

అవును వాడే — శనిగాడు, శానయ్య. రాజారాంగారింట్లోవాడు — మశానంగాడు.

"నువ్వా!" అంది ఆశ్చర్యంతో, చెయ్యి వెనక్కి లాక్కుని

"పిట్ట పెరిగిందే. ఓణీలేస్తుందావ్! మజాగుండావులే" అని శానయ్య. రెండు చేతులు వెనకభుజాలకిందనించి పోనిచ్చి, ఆమె రొమ్ముని అదిమిపట్టుకుని, దగ్గరకు లాక్కున్నాడు.

"ఇదేంటి, వొదులు చచ్చినోడ వొదులు, అరుస్తా" అంటుంది. ఆమెను ఇంకా దగ్గరకు తీసుకున్నాడు. నలిపి వేస్తున్నాడు. బలంగా భుజాలు, చేతులు వొంచేస్తున్నాడు. తనవైపుకి తిప్పి, వాడిలోకి తీసుకుని, నలిపి, నొక్కి, ఉక్కిరిబిక్కిరిచేస్తూ, మొహంఅంతటా ముద్దులు కురిపిస్తున్నాడు. ఆ బలంమధ్య నలిగి, పిరసమైపోతోంది. తోస్తోంది. వేళ్ల పీకుతోంది. రక్కుతోంది. మోటగా—కరుస్తున్నాడు,కొరుకుతున్నాడు ఛీ, ఛి — అమ్మి రవిక చింపేశాడు. అక్కడకొరుకుతున్నాడు. జడ మెడచుట్టూ తిప్పి, పీకమీద చెయ్యేసి, పెదవుల్ని గట్టిగా కొరుకుతున్నాడు. నుదుటిమీద పన్ను—అబ్బ. ఛీ, ఛి — తూలబడింది. వాడూ తూలబడ్డాడు పట్టు వదలకుండా. అడుగుపెదవి పంటితో ముందుకులాగి కొరుకుతున్నాడు. కాలితో ముందున్న చాపచుట్టని కదపడంతో పట్టు సడలింది. గట్టిగా వాడిమెడని పైకి తోసి, తప్పించుకుని బైటికి పరుగెత్తింది. వాడు వెనక వస్తున్నాడు.

'రాత్రి రాకుంటివా చూచుకోమజాకా' ముందువరండా గదితో కొచ్చేసింది. అక్కడ ఇద్దరు మనుషులు, ఏదో పని చేస్తున్నారు. మెట్లమీద తివాసులు తీస్తున్నారు. మరో ఇద్దరు, స్తంభాన్ని దించుతున్నారు. కిందపడింది స్తంభం. దాన్ని దొర్లించుకుంటూ వెళ్ళారు. రంపాలతో ఏదో కోస్తున్నాడు ఆ కుర్రాడు. గునపంతో మట్టి తవ్వి, కర్రపాతి, దానికి తాడుకట్టి, ఆ తాడుమొన వొక దిమ్మ చుట్టూ కట్టి, లాగి, పెల్లగించాడు. శానయ్య కిటికీ ముందు స్తంభంపైకి ఎక్కాడు. ఆ బొమ్మల్ని కదుపుతున్నాడు. ఏదో ఇనపకడ్డీపెట్టి, బొమ్మ పాదం పైకి లేపుతున్నాడు. ఆడబొమ్మ కిందకి పడిపోయింది. మోకాలు దిమ్మమీద వుండిపోయింది. వొక్కతాపు తన్నాడు దిమ్మ, కాలు కిందపడ్డాయి.

"అపు ఆ బొమ్మని తాకమాక అంది మన్న.

కోరగా చూశాడు. వాడికళ్లు ఎర్రగా వున్నాయి—కోరమీసాలు. నల్ల దిబ్బ మొహం — ఇనుముచేతులు — ఆడిచెమట నోటంట ఆ వాసన మొగాడి మాంసం వాసన.

"ఇదుగో సూస్కో తడాఖా"

అని రెండో బొమ్మని వొక్క తాపు తన్నాడు శానయ్య.

"ఓగు దాన్ని తన్నమాక. దాన్ని ఏమన్నా చేస్తివా, చంపేస్తా" అంది మన్ను.

"సంపటం రాతిరికి చేదువుగానిలే" అని, రెండో బొమ్మ దిమ్మని కడ్డీతో కదుపుతున్నాడు. కుడివైపునుంచి బొమ్మ కాళ్ళమీద తాపుతన్నాడు. ఏదో ముక్క ఎగిరి మన్ను నుదుటిమీద పడింది. 'అమ్మో' అంది. రక్తం కారుతోంది. ఆవేశం వొచ్చేసింది. మెట్లమీద కర్రకు తగిల్చిన ఇనపకడ్డీని, బలంగా పైకి విసిరింది. అది శానయ్య పీకకి తగిలి కోసింది. 'అయ్యో' అని పెద్ద కేకపెట్టి కిందకు పడిపొయ్యాడు. దగ్గరకెళ్లి చూసింది, మెడ తెగింది. రక్తం కారుతోంది. కళ్ళు మూసుకుంటున్నాడు. పళ్ళు బైటికి కనిపిస్తున్నాయి. నాలుక వేల్లాడతోంది. గుండెమీద చెయ్యి వేసింది. శ్వాసలేదు. గుండె కదలడం లేదు. వాడు చచ్చిపొయ్యాడు. జనం పోగయ్యారు. 'ఏమిటి?' 'ఎవరు?' 'ఎన్నా ఇది' 'ఎంగెగలాటా?' ఏవేవో కంఠాలు. ఇంకా మూగుతున్నారు.

"అవును — నేనే చంపా" అంది మన్ను పొంగివస్తున్న కన్నీటిని తుడుచుకుంటూ. అదీ, ఆ మూడోగీక చరిత్ర కొంచం చిన్న దెబ్బ: చిన్నగీటూ, తిన్నగాలేక, కుడి కనుబొమ్మవైపుకు దిగిన చిన్న గీటు.

* * *

బాలనేరస్థుల పాఠశాల సూపరింటెండెంట్, పార్థసారథి చెప్పిని కథఇది సంక్రాంతి సెలవుల్లో నాలుగురోజులు పార్థసారథితో గడిపాను. అతను జర్మనీలో మన రాష్ట్రంలో తరిఫీదు పొంది బాల నేరస్థుల సంక్షేమ కార్యకలాపాలపై టోక్యోలో జరిగిన అంతర్జాతీయ గోష్ఠిలోపాల్గొని, ఈ మధ్యనే స్వదేశానికొచ్చాడు. పదహారు, ఇరవై వయస్సులో నేరాలుచేసిన బాలబాలికల్ని బోర్స్టల్ పాఠశాలల్లో వుంచి, విద్యగరిపి బాగుచేస్తారట. అన్నిదేశాలలోనూ బాలనేరస్థుల నేరాలని పరిశీలించే కోర్టులుంటాయట. నేరస్థుల్ని రెండు మూడు సంవత్సరాలు. ఈ పాఠశాలలో వుంచి శిక్షణ ఇస్తారట. కొందరిని కఠిన నిర్బంధంలో వుంచుతారట. దారుణ నేరాలను చేసినవారిని - మరికొందర్ని విచ్చలవిడిగా తిరిగి విద్య నభ్యసించే పద్ధతుల్ని నిర్వహించే స్కూళ్ళలో వుంచుతారట. టోక్యోలోజరిగిన గోష్ఠిలో ఎక్కువకాలం వీరిని నిర్బంధంలో వుంచితే బాగుపడక, మరింత చెడిపోతారు గావున ఐదారు మాసాలు స్వేచ్ఛా పాఠశాలల్లో వుంచి వృత్తి విద్య నేర్పితేనే మంచిదని పలువురు అభిప్రాయ పడ్డారుట. పార్థసారధి ఇలా వ్యాఖ్యానించాడు.

"ఇప్పుడు మన అదే మన్ను విషయం చూడు. చేసింది హత్య. హత్యానేరానికి, నిర్బంధ పాఠశాలలో మూడేళ్ళు వుంచాలని కోర్టు తీర్పు. కాని హత్యచేసినప్పుడు ఆమె వయస్సు పదమూడు. ఏం చెయ్యాలి? స్వేచ్ఛా పాఠశాలలో నాలుగైదు నెలలు వుంచితే చాలునని సూచించాను. ఎట్లాగో వొప్పించాను. మూడునెలలు పూర్తయింది ఇప్పటికి. కుట్టుపనులు నేర్చుకుంది.

మన జవానులకి స్వెట్టర్లు స్టాకింగ్స్ కుట్టింది. చక్కటి ప్రవర్తన. ఆక్షేపణకి తావీయకుండా నడుచుకునేది. ఇంక ఆమెని వొదిలెయ్యాలని సిఫార్సుచేశాను. ప్రభుత్వంలో పెద్దలు ఏకళని వున్నారో 'సరే' అన్నారు

రేపు విడుదల చేస్తున్నాం" అన్నాడు సగర్వంగా.

"హత్యకి కారణంఅంటూ వుండాలంటారుకదా – మన్ను. శానయ్యని ఎందుకు హత్య చేసిందంటారు?" అని అడిగాను. ఆయన ఏదన్నా కొత్త విషయాలు చెప్తే వినాలని.

"నిజానికి ఆమె తలపెట్టింది హత్య కాదు. ఆ బొమ్మల్ని కాపాడ్డం – ఆమె నిశ్చయం. ఆ బొమ్మలు. ఆమెకీ సంఘానికీ నడుమవున్న లంకి. కుటుంబం. తలిదండ్రులప్రేమ – ఇవి సంఘంతో బంధం ఏర్పరిచే శక్తులు. మణికి తలిదండ్రులు లేరు. తల్లి రెండు బొమ్మలు ఇచ్చిపోయింది. తల్లి ఇవ్వడం అవి ఆమె దృష్టిలో అందమైన బొమ్మలు కావడం – ఈ రెండూ ముఖ్యం. ఆ బొమ్మల్ని దొంగాడు ఎత్తుకుపొయ్యాడు. రాజారాం ఇంట్లో అలాంటి బొమ్మలు చూసి సంబరపడింది. అతను ఆర్థిక ఇబ్బందిలో పడ్డాడు. ఆస్తిని జప్తుచేసి లాక్కుపోయి వేలం వేశారు. ఆ బొమ్మలు పోయాయి. మిగిలిన తాత చచ్చిపోయాడు. పట్నం వొచ్చాక ఆ సినిమా స్టుడియోలో సెట్టింగులు. కట్టడం, తియ్యడం జరుగుతుంది. అక్కడ శానయ్య పనిలో చేరాడు. ఆ సెట్టింగులలో రెండు బొమ్మలు కనుపించాయి. సెట్టింగును తీసేస్తున్నారు పనివాళ్ళు. శానయ్య ఆపనిలో వున్నాడు. ఆమెకి అదంతా తెలియదు. బొమ్మల్ని ధ్వంసం చేస్తున్నాడనుకుంది, తనకు సంఘంతో బంధం ఏర్పరచిన బొమ్మలు,తట్టుకోలేకపోయింది, చంపేసింది. ఇక రెండోది ఆమెకి సౌందర్యం కావాలి. చదువు, సంస్కారం, భోగభాగ్యాలులేవు. ఆమె జీవితంలో. అయినా, ఆమెలో సహజమైన సౌందర్యతృష్ణవుంది. ఇప్పుడు మన శాస్త్రజ్ఞులు, కొందరిలో పుట్టుకతోనే సౌందర్యతృష్ణ వుంటుందన్న సిద్ధాంతం ప్రతిపాదించారు. ఈ తృష్ణని పెంపొందిస్తే మనసులో తికమకలు, జాడ్యాలూ సమసిపోతాయని వీరి సిద్ధాంతం. అందుకనే ఈనాడు అన్నిపాఠశాలలలోనూ చిత్రలేఖనం, నాట్యం మొదలైన కళలని పెంపొందించే అవకాశాలు కల్పిస్తున్నారు.

మణికి సౌందర్యం కావాలి. ఆ బొమ్మలలో సౌందర్యం వుంది. వాటిని ధ్వంసం చేస్తున్న వ్యక్తి శానయ్య. వాడిలో సౌందర్యంలేదు. వికృతంగా వుంటాడు. మోటగా వ్యవహరిస్తాడు. రక్కుతాడు, కొరుకుతాడు, ఇనుము చేతులతో నలుపుతాడు. చెమట వాసన. అలాంటివాడు ఆ బొమ్మల్ని ధ్వంసం చేస్తుంటే తట్టుకోలేకపోయి హత్య చేసింది. వికృతాన్ని, అందం హత్య చేసిందన్న మాట!"

అని పార్థసారథి నవ్వుతున్నాడు. అర్థమైనట్లు నేనూ హర్షం వెలిబుచ్చాను.

"మరి,-నుదుటిమీద గీట్లకీ-హత్యకీ ఏదన్నా సంబంధం వుందా?" అని

ప్రశ్నించాను. పత్రికా విలేఖరి ధోరణిలో.

"మన్ను మశానమూను – దానికీ, దీనికీ ఏ సంబంధమూలేదు. మూడు సార్లు. మూడు దెబ్బలూ నుదటి మీద తగలడం కేవలం ప్రమాదవశాత్తు జరిగింది." అని ముగించాడు. చివరవాక్యములో ఈ కథకి నామకరణం కూడా చేశాడు పార్థసారథి అప్రయత్నంగా.

ఆ ఉదయం అతనితో వెళ్లి పాఠశాల శిక్షణలోవున్న మణిని చూపినప్పుడు నన్ను వెంటనే ఆకర్షించినది. ఆమె నుదుటిమీద గీతలే. ఆమె నవ్వు మొహంతో వుందేగాని ఏమీ మాట్లాడలేదు.

"అసలు సంగతి చెప్పడం మరిచిపొయ్యా"

చెప్పండి."

"నేను, జపాన్‌నుంచి వొస్తూ, 'వాకీ-టాకీ' అనే బొమ్మలు తెచ్చాను. రెండడుగుల ఎత్తుది. 'కీ' ఇస్తే నడుస్తుంది—మాట్లాడుతుంది.

బొమ్మా. అంతకుముందు, వారం రోజులుగా మాట్లాడ్డం మా నేసింది మన్ను. కిష్టయ్యభార్య చూడ్డానికి వొచ్చినప్పటినుంచీ కిట్టయ్యభార్య మంచిది స్నేహంగా వుంటుంది. ఆ స్నేహంతో సంఘంతో లంకె ఏర్పడే పరిస్థితి తన కిష్టంలేదు ఈ అయిష్టమే ఆమె మౌనానికి కారణం. మాట్లాడ్డం మానేసిన మన్ను ఈ బొమ్మ మాట్లాడ్డంచూడగానే తనూ మాట్లాడ్డం మొదలెట్టింది. తీసుకో ఈబొమ్మ నీకోసమే తెచ్చాను అన్నాను. కృతజ్ఞతతో, దైన్యంతో ఆమె కళ్లు తడిసినై. ఆక్షణంలో సౌందర్య సాక్షాత్కారం అయింది నాకు" ఆ సౌందర్య ఛాయలు నాలోనూ మెదలడం మొదలెట్టాయి కాబోలు రుమాలుతో కళ్ళు తుడుచుకున్నాను. ★


కుటుంబ నియంత్రణకు

# సత్వరక్షణి

ఆపరేషన్ భయము లేదు.

(సంతాన నిరోధిని)

పురుషులు మాత్రమే యీ ఔషధము సేవించుటకు అనుకూలముగా తయారు చేయబడినది. యీ ఔషధం సేవించిన, సంతానము కలుగక పోవుటయేగాక, మంచి బలమును, ఆరోగ్యమును యిచ్చును. దాంపత్యమునకు ఎట్టి అసౌకర్యమువుండదు. ఔషధసేవ 30 రోజులు మాత్రమే. పత్యములేదు. పూర్తికోర్సు సీసా వెల; రు. 10. పోస్టేజి, ప్యాకింగు అదనం

స్వదేశీ ఆయుర్వేద ఫార్మశీ, తెనాలి.